

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
శనివారం | 02 డిసెంబర్ 2023 | www.navatelangana.com

ఎక్కడికక్కడే లెక్కలు..

- విజయంపై ఎవరి ధీమా వారిదే
- ఆశల పల్లకిలో అభ్యర్థులు
- రేపే కౌంటింగ్..
- వెల్లడికానున్న అభ్యర్థుల భవితవ్యాలు


8లో...



'అందోల్'లో తగ్గిన పోలింగ్

- 2018లో 89.27 శాతం.. నేడు 84.80 శాతం నమోదు
- ప్రశాంతంగా తెలంగాణ శాసనసభ-2023 ఎన్నికలు
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

8లో...



ఎవరి ధీమా వారిదే

పోలింగ్ బూత్‌ల వారీగా పోస్టుమార్టం



- కాంగ్రెస్‌కు కలిసొచ్చిన ప్రభుత్వ వ్యతిరేకత
- బీఆర్ఎస్‌ను బతికిస్తున్న పోల్‌మేనేజ్‌మెంట్
- ఎగ్జిట్ పోల్ లెక్కలతో కాంగ్రెస్‌లో జోష్
- హాట్రిక్ కొడతామంటున్న గులాబీ శ్రేణులు
- గెలుపు, ఓటములపై బెట్టింగులు

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపోటములపై ఎవరి ధీమా వారికుంది. పక్కాగా గెలుస్తున్నామంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారిగా ఓటింగ్ సరళిపై పోస్ట్‌మార్టం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుస్తున్నామంటుంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పోల్‌మేనేజ్‌మెంట్ వల్ల హాట్రిక్ సాధిస్తామంటూ గులాబీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. చివరి రెండు రోజుల్లో మాజిక్ జరిగిపోయిందని చెప్పాలి. గెలుపు దిశగా ఉన్న వాళ్లు ఓటమి వైపు...వెనకబడిన వాళ్లు ముందుకు దూసుకుపోవడం కనిపించింది. పోల్‌మేనేజ్‌మెంట్‌తో పాటు చివరి సమయంలో పడిన ఓటర్లే గెలుపును నిర్ణయించనున్నారనే చర్చ ఉంది. పాత స్థానాలతో పాటు అదనంగా ఒకటి గెలుస్తున్నామంటూ బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తుంది. కనీసం 9 స్థానాల్లో గెలుస్తున్నామంటూ కాంగ్రెసోళ్లు వాదిస్తున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వివరాలు 2లో

బర్త్ డే గిఫ్ట్ ఎవరిని వరించేనో!

ఈనెల 5న దామోదర, 6న క్రాంతి కిరణ్ పుట్టినరోజులు

2లో...

రేపు వచ్చే ఫలితాల్లో ఎవరికో ఒకరికి అద్భుతమైన బర్త్ డే గిఫ్ట్

ఓటెత్తిన ఉత్సాహం..

- రాష్ట్రంలోనే అత్యధిక శాతం పోలింగ్
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా కృషి
- శుభాకాంక్షలు తెలియజేసిన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

3లో...



కాకతీయ హైస్కూల్‌లో షార్ట్ సర్క్యూట్

సిబ్బంది చాకచాక్యంగా వ్యవహరించడంతో తప్పిన ఆస్తి, ప్రాణ నష్టం

- ఫ్రిడ్జ్ పేలడంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- చాకచక్యంగా వ్యవహరించి మంటలు ఆర్పేసిన సిబ్బంది
- పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన..
- సిద్దిపేటలోని హౌసింగ్‌బోర్డ్‌లో ఘటన...

సీఎస్‌లో...



ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రామచంద్రాపురం

ఆర్థిక ఇబ్బందులు తాళలేక చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురంలోని శ్రీనివాస్ నగర్‌లో మంగలి శివ కుమార్(28) తన భార్య, ఒక కూతురు, ఒక కొడుకుతో కలిసి నివాసముంటున్నాడు. అయితే శివకుమార్‌కు సరైన ఉద్యోగం లేకపోవడంతో గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 04:30 గంటలకు ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా అతడు ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతుకుతుండగా మధ్యాహ్నం 3:15 గంటలకు రామచంద్రాపురం లోని రాయసముద్రం చెరువులో శవమై కనిపించాడు. మృతుడి సోదరుడు మంగలి మల్లేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఓట్ల జాతర ముగిసింది.. గెలుపు జాతరే మిగిలింది

హీటెక్కిస్తున్న హాట్ హాట్ చర్చలు..

నవతెలంగాణ-జిన్నారం

ఓట్ల జాతర ముగిసింది.. ఇక గెలుపు జాతరే మిగిలింది. ఎక్కడ చూసినా అదే చర్చ... ఎవరిని పలకరించిన అదే మాట. ఇప్పుడంతా గ్రామాలు, వీధులు, గల్లీలు, రచ్చబండలు, చౌరస్తాలు, బస్టాండ్లు, అడ్డాలు, మార్కెట్లు, చాయ్ హోటల్లు, జనం గుమిగూడే ఏ చోటైనా మేం గెలుస్తున్నామంటే.. మేం గెలుస్తున్నామని పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చర్చలు పెడుతున్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

ఎన్నికల రణరంగంలో ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపే ప్రధాన లక్ష్యంగా అగ్రనాయకత్వం నుంచి కింది స్థాయి నాయకత్వం విస్తృత స్థాయి కసరత్తు, చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎవరి గెలుపుపై వారే ధీమాగా ఉన్నారు. ప్రజాదరణ, పోల్ మేనేజ్మెంట్, అభివృద్ధి, సంక్షేమం, మేనిఫెస్టోలు ప్రభావవంతమైన ప్రచారం, అన్ని వర్గాలను ఆకట్టుకునే ప్రసంగాలు, యువత వృద్ధులు మహిళలు కర్షకులు కార్మికులు నిరుద్యోగులు, ఉద్యోగులు ఇతరత్రా అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా తమ తమ అభ్యర్థుల తరపున ప్రత్యేకమైన వ్యూహాత్మక ప్రచారం మమ్మల్ని గెలిపిస్తుందంటూ కింది స్థాయిలో గ్రామాల వారిగా ఎవరికి వారు ప్రధాన పార్టీలపరంగా గెలుపు పై ధీమాగా ఉన్నారు.



హీటెక్కిస్తున్న హాట్ హాట్ చర్చలు...

గ్రామాల్లో ఎక్కడ చూసినా సాధారణ జనం ఓట్ల పండుగ అయిపోయింది. ఇక స్వీట్ల పండుగ మిగిలింది. మీ ఊ ళ్లో ఏ పార్టీ వాళ్ళు గెలుస్తారు? మా ఊళ్లో ఏ పార్టీ వాళ్ళు గెలుస్తారు అనే రసకందాయపు చర్చలు హీటెక్కిస్తున్నాయి. ఏ నలుగురు కలిసిన ఇప్పుడంతా ఇదే చర్చ జిన్నారం మండల వ్యాప్తంగా గడియారంలోని సెకండ్ల నిమిషాల గంటల ముల్లుల కొనసాగుతుంది. ఇదిలా ఉంటే ఈపాటికే పటాన్చెరువు నియోజకవర్గ పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపుకు సంబంధించి పోలింగ్ బూతుల వారిగా మెజారిటీ సాధించడంలో ప్రధాన నాయకులు క్రింది స్థాయి నాయకులతో కలిసి పార్టీ శ్రేణులతో కలిసి తాము చేసిన కృషి శ్రమ పార్టీల అభ్యర్థులతో పాటు అగ్రనాయకత్వానికి వివరించే ప్రక్రియలో ఈపాటికే తల మునకలయ్యారు. గెలుపు పై ఎవరి ధీమా వారికున్నప్పటికీ పటాన్చెరువు అసెంబ్లీ సెగ్మెంట్ ఎవరి ఖాతాలో పడనుందో తేలాలంటే డిసెంబర్ మూడు దాకా మరి వేచి చూడాల్సిందే.

ఎవరి ధీమా వారిదే

(మొదటిపేజీ తరువాయి)

బూత్‌ల వారిగా పోస్ట్‌మార్టం

పోలింగ్ ముగిశాక నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల వారిగా పోలైన ఓట్లపై పోస్ట్‌మార్టం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రతి పోలింగ్ బూత్‌లో తమకు ఎన్ని ఓట్లు వస్తున్నాయనే లెక్కలేస్తున్నారు. ఆ బూతులో పోలైన ఓట్లల్లో ఏ వర్గాల వాళ్లు తమకు అనుకూలంగా ఓట్లు వేశారనే వివరాలపై సమీక్షిస్తున్నారు. యువత, రైతులు, వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, సామాజిక తరగతుల ఓటర్లలో ఎవరెవరూ ఏ పార్టీకి ఓటు వేశారనేది క్షుణంగా లెక్కలు తీస్తున్నారు. సాయంత్రం పోలైన ఓట్లలో అత్యధికంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా పడినట్లు చెబుతున్నారు. వృద్ధులు, రైతులు, మహిళల్లో ఎక్కువ మంది బీఆర్ఎస్‌కు ఓట్లేశారనే ధీమా ఆ పార్టీ నేతల్లో కనిపిస్తుంది. యువకులు, ఉద్యోగులు, ప్రభుత్వ వ్యతిరేకులు వన్‌సైడ్‌గా కాంగ్రెస్‌కు ఓట్లేశారని హస్తం నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య పోటీ లేదంటే అభ్యర్థుల మధ్య జరిగిన పోటీ కాకుండా ప్రభుత్వ వ్యతిరేకులు... ప్రభుత్వ అనుకూలురు అన్న పద్ధతిలో ఓటర్లు చీలిపోయి ఓట్లేశారు. దీనికి తోడు కొంత మేరకు అభ్యర్థుల వ్యక్తిత్వం, పనితీరు ప్రభావం కూడా కనిపిస్తుంది. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ పట్ల మంచి అభిప్రాయమున్నా ఆ పార్టీ అభ్యర్థి పట్ల వ్యతిరేకత కనిపించింది. కొన్ని చోట్ల వ్యక్తుల పట్ల సానుకూల వైఖరి ఉన్నప్పటికీ పార్టీ పరంగా వ్యతిరేకంగా ఉండడం కూడా కనిపించింది. అందుకే 11 స్థానాలకు గాను కాంగ్రెస్ సగం సీట్లు గెలిచే ఛాన్స్ లేకపోలేదంటున్నారు. బూత్ ఇంచార్జీల పనితీరు, ఆ స్థానిక బాధ్యులు చేసిన ప్రయత్నాలు ఏ మేరకు వర్కవుట్ అయిందనేదాని మీద ఆరా తీస్తున్నారు.

కాంగ్రెస్‌లో జోష్ నింపిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందంటూ మెజార్టీ సర్వే సంస్థలు తేల్చాయి. వివిధ సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడంతో ఆ పార్టీలో జోష్ నిండింది. మూడు జిల్లాల్లో కాంగ్రెస్ కనీసం 9 స్థానాల్లో గెలుస్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, మెదక్, పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్, దుబ్బాక, హుస్నాబాద్‌లో గెలుస్తున్నామని ఆ పార్టీ ధీమా వ్యక్తం చేస్తుంది. గజ్వేల్, సిద్దిపేటలో కూడా గట్టి పోటీ ఇస్తున్నామంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉండడం, ఆరు గ్యారంటీల పట్ల ప్రజల్లో భరోసా నింపడం వంటి అంశాలు తమకు కలిసొచ్చాయంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పనితీరు పట్ల తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. దానిని కాంగ్రెస్ ఆ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోగల్గింది.

హ్యాట్రిక్ కొడతామంటోన్న బీఆర్ఎస్

కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పోల్‌మేనేజ్‌మెంట్, బలమైన పార్టీ నిర్మాణం తమకు అనుకూలంగా కలిసొస్తుంటూ బీఆర్ఎస్ హ్యాట్రిక్‌పై గట్టి నమ్మకంతో ఉంది. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారంటూఉన్నారు. గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, పటాన్ చెరు, నారాయణఖేడ్ ఇలా అన్ని సీట్లు గెలుస్తున్నా మంటున్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు అభ్యర్థి వ్యక్తిత్వం తమకు అనుకూలంగా కలిసొస్తుందని బావించిన బీఆర్ఎస్ అభ్యర్థులు పోల్‌మేనేజ్‌మెంట్‌ను కూడా బలంగా నమ్ముకున్నారు. బూత్ లెవల్ కమిటీల వ్యవస్థ ఉండడంతో విపరీతంగా డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. చివరి రోజు చేసిన ప్రయోగం తమకు అనుకూలంగా మారితే 11 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్

బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మధ్య నువ్వానేనా అన్నట్లుగా పోటీ సాగింది. పోలింగ్ సరళిలో కూడా అదే తీవ్రత కనిపించింది. దీంతో ఆ రెండు పార్టీల మధ్య నెలకొన్న పోటీ నేపథ్యంలో గెలుపోటములపై బెట్టింగ్‌లు కాస్తున్నారు. పార్టీ వారిగా కాంగ్రెస్ గెలుస్తుందని ఒకరు బీఆర్ఎస్ గెలుస్తుందని మరొకరు బెట్టు కాస్తున్నారు. పార్టీల వారిగానే కాకుండా అభ్యర్థుల వారిగా పలాన అభ్యర్థి గెలుస్తున్నాడని ఒకరు లేదు అతను ఓడిపోతున్నాడంటూ ఇంకొకరు బెటింగ్ కాస్తున్నారు. అందే కాదు కేసీఆర్ మూడో సారి ముఖ్య మంత్రి అవుతారని ఒకరు లేదు రేవంత్‌రెడ్డి తొలిసారి సీఎం అవుతున్నారంటూ ఇంకొందరు బెటింగ్ కాస్తున్నారు. వందల కోట్ల బెట్టింగ్ వ్యవహారం నడుస్తోంది.

ఏ నోట విన్నా ఫలితాలపైనే

పోలింగ్ పూర్తయ్యా ఉత్కంఠ మరింత పెరిగింది. గెలుపుపై నువ్వానేనా అన్నట్లు పోటీ కనిపిస్తుండడంతో మైక్రో స్థాయిలో ఎంత శోధించిన నిక్షిప్తమైన అంచనాకు రాలేకపోతున్నామంటూ తలలు పట్టుకుంటున్నారు. కాంగ్రెస్ గెలుస్తుందని, బీఆర్ఎస్ గెలుస్తుందని ఇలా ఎవరి వాదన వాళ్లు వినిపిస్తున్నారు. ఏ నలుగురు గుమికూడినా ఎన్నికల ఫలితాల గురించే చర్చించుకుంటున్నారు. లీడర్లు, క్యాడరే కాదు కామన్ మ్యాన్ కూడా ఎన్నికల ఫలితాల గురించి అంచనాకొచ్చి చర్చిస్తున్నారు.

బర్త్ డే గిఫ్ట్ ఎవరిని వరించేనో!

ఈనెల 5న దామోదర, 6న క్రాంతి కిరణ్ పుట్టినరోజులు

- రేపు వచ్చే ఫలితాల్లో ఎవరికో ఒకరికి అద్భుతమైన బర్త్ డే గిఫ్ట్

నవతెలంగాణ-జోగిపేట



ప్రజాప్రతినిధుల పుట్టినరోజు వేడుకలను వారి పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు సంబురంగా జరపడం సహజం. కానీ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన ఇద్దరు నాయకుల పుట్టిన రోజులు ఒకే నెలలో ఒకే రోజు తేడాలో ఉండడం. అలాగే వారి బర్త్ డేలకు రెండ్రోజుల ముందే ఎన్నికల ఫలితాలు ఉండడం చాలా అరుదు. అలాంటి అరుదైన ఘటనే ఇప్పుడే అందోల్‌లో జరగనున్నది. ఆ ఇద్దరి నాయకులకు ఈ బర్త్ డే మరిచిపోలేని అనుభూతిని ఇవ్వనున్నది.

అందోల్ నియోజక వర్గానికి డిసెంబర్ నెల ఎంతో ప్రత్యేకమైనది. ఈనెల 5న మాజీ ఉప ముఖ్యమంత్రి, సీడబ్ల్యూసీ మెంబర్, అందోల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహ పుట్టినరోజు ఉండగా.. ఆ మరుసటి రోజే (డిసెంబర్ 6) బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ పుట్టినరోజు ఉన్నది. అయితే ప్రతీయేడు ఒకరిని మించి మరొక పార్టీ కార్యకర్తలు సంబురంగా వారి నాయకుల పుట్టినరోజు వేడుకలను జరిపే వారు. కానీ ఈసారి మాత్రం వారి పుట్టినరోజులకు రెండ్రోజుల ముందే ఎన్నికల ఫలితాలు ఉండడంతో.. వారికే కాకుండా పార్టీ కార్యకర్తల్లో కూడా సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఈ ఎన్నికల ఫలితాలు


దామోదర రాజనర్సింహా


చంటి క్రాంతి కిరణ్

ఎవరికి మరిచిపోలేని క్షణాలను మిగులుస్తాయో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫలితాల్లో పై చేయి సాధించిన వారు మరిచిపోలేని క్షణాలతో ఘనంగా వేడుకలను జరుపనున్నారు. ఓటమి పాలైన వారు మాత్రం నిరాశలో మిగిలిపోనున్నారు. ఈ అద్భుతమైన బర్త్ డే గిఫ్ట్ ఎవరిని వరించోనే తెల్సుకోవడానికి రేపటి వరకు వేచి చూడాల్సిందే.

జప్తు చేసిన రూ.3.44 కోట్లు విడుదల

నవతెలంగాణ-సంగారెడ్డి

ఎన్నికల తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 173 కేసుల్లో రూ.5,27,42,852 జప్తు చేసిన విషయం విధితమే. అయితే అందులో 162 కేసులకు సంబంధించి రూ.3,44,22,338 విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత వ్యక్తులు సమర్పించిన ఆధారాలను తనిఖీ చేసి, జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా డబ్బులు విడుదల చేసినట్టు తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 45 కేసుల్లో జప్తు చేసిన రూ.86,53,810 మొత్తం విడుదల చేసినట్లు చెప్పారు. అందోల్ నియోజకవర్గంలో 12 కేసుల్లో



రూ.19,80,020లు జప్తు చేయగా, 11 మందికి రూ.18,50,020లు విడుదల చేసామని, జహీరాబాద్ నియోజకవర్గంలో 41 కేసుల్లో రూ.1,45,23,430 జప్తు చేయగా, 39 కేసులకు సంబంధించి రూ.97,97,430/ విడుదల చేసినట్టు తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 29 కేసుల్లో జప్తు చేసిన రూ.56,15,988లో 27 మందికి రూ.54,65,488 విడుదల చేశామన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో 46 కేసుల్లో రూ.2,19,69,604 జప్తు చేయగా, 40 కేసులకు సంబంధించి రూ.86,55,590 విడుదల చేసినట్లు తెలిపారు. 11 కేసులకు సంబంధించి సరైన ఆధారాలను సమర్పించనందున రూ.1,83,20,514 నగదు విడుదల చేయలేదన్నారు. సంబంధితులు సరి అయిన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి నగదును విడుదల చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఓటెత్తిన ఉత్సాహం..

- రాష్ట్రంలోనే అత్యధిక శాతం పోలింగ్
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా కృషి
- శుభాకాంక్షలు తెలియజేసిన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



నవతెలంగాణ-మెదక్

జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఎంతో కృషి చేశారని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను తన బృందంతో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ శాతం నమోదులో మెదక్‌ను రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిపారన్నారు. ఓటున్న ప్రతి ఒక్కరు ఓటును సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటర్లలో చైతన్యం తెచ్చేలా వివిధ కార్యక్రమాలను కలెక్టర్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాముఖ్యత, ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించారన్నారు. బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాలు, మార్కెట్ యార్డులు, విద్యాసంస్థల్లో సాంస్కృతిక కళాజాతా కార్యక్రమాలు, టీఎన్జీవో ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఇక్బాల్ పాషా, సంయుక్త కార్యదర్శి పోతురాజు శంకర్, మెదక్ యూనిట్ కార్యదర్శి ఆరేళ్ల రామా గౌడ్ ఉన్నారు.

పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వైద్యాధికారి వేదశ్రీ ఆధ్వర్యంలో పి.హెచ్.సి సిబ్బంది ఆస్పత్రి నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పెద్ద శంకరంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది శ్రీదేవి, యాదయ్య , గ్రేస్ వెంకటేశం , రామ్మోహన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసు యాక్ట్

ఎస్పి పి.రోహిణి ప్రియదర్శిని



నవతెలంగాణ-మెదక్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా డిసెంబర్ 31వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పి రోహిణి ప్రియదర్శిని తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలాగే శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మర్పడగ గ్రామం పల్లెపహడ్ రైతు దుర్గయ్యకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుత్‌ఘాతంతో శుక్రవారం మృతి చెందింది. దుర్గయ్య తన రెండు ఎడ్లను నీళ్ల తాగించడానికి తీసుకెళుతుండగా విద్యుత్ వైరు తెగి వాటిపై పడింది. దాంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. చూసినవారు వెంటనే పక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వద్ద కరెంటు నిలిపివేయడంతో మరో ఎద్దుకు ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన విద్యుత్ శాఖ ఏఈ సత్యం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.70 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



నవతెలంగాణ-టేక్మాల్

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మృతి చెందితే వారి కుటుంబాలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోడుమెట్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి రాములు, అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బోడిమెట్‌పల్లి గ్రామానికి వచ్చి రాములు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. దహన సంస్కారాల కోసం తక్షణమే రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం రాములు పిల్లల పేర్ల మీద, రెండు లక్షల రూపాయలను డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. రాములు చనిపోయేంతవరకు బీఆర్ఎస్ పార్టీకి క్రియాశీల సభ్యునిగా పనిచేశారన్నారు. పార్టీ నుంచి రావాల్సిన సబ్సిడీలను పార కుటుంబానికి అందజేస్తామని చెప్పారు. పిల్లల చదువును ప్రభుత్వం చూసుకుంటుందని ఆయన భరోసానిచ్చారు. ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం రాములు చిన్ననాటి మిత్రులు చందాలు వసూలు చేసి రూ.80 వేలను రాములు కుటుంబ సభ్యులకు అందించారు. రాములు పిల్లల పేర్ల మీద గ్రామానికి చెందిన వ్యాపారవేత్త శంకరప్ప లక్ష రూపాయలు డిపాజిట్ చేశారు. తన మిత్రున్ని కోల్పోయానని మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ రూ.20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

కేసీఆరే తెలంగాణ ముఖ్యమంత్రి

తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు సతీష్ చారి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

బీఆర్ఎస్‌కు ప్రజల సంపూర్ణ మద్దతు ఉన్నదని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం లాంఛనమేనని తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు సతీష్ చారి అన్నారు. శుక్రవారం తూప్రాన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఫేక్ సర్వేలతో ఎంత కుమ్మక్కు రాజకీయాలు చేసినా ఈ ఎన్నికల్లో తాము ఎక్కువ స్థానాల్లో గెలిచి ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రాబోతున్నట్టు తెలిపారు. దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నేత కేసీఆర్ అని, ఆయన నాయకత్వంతో తెలంగాణ సురక్షితంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలతో ఫేక్ సర్వేలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నదన్నారు. ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు కర్ణాటకలో అమలు కావడం లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమం వైపే ప్రజలు ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఫేక్ సర్వేలు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, ఉస్మానియా నాయకులు గొడెల్లి చంద్రశేఖర్,నాయకులు బందెల నరేష్, వెంకటాచారి, చెలిమల నరేష్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం తథ్యం





నవతెలంగాణ-నార్సింగి

మండలంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. జెడ్పీటీసీ కృష్ణా రెడ్డి, ఎంపిపి సబిత రవీందర్, వైస్ ఎంపిపి సుజాత శంకర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, మండల మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి తదితర నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 88 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం ఎక్కువగా ఉండడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఓటింగ్ ప్రక్రియ ముగి సిన అనంతరం జెడ్పీటీసీ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ సంక్షేమ పథకాలు, పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసిన మోసపూరిత ఎన్నికల వాగ్దానాలు నమ్మలేరని, ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ నియోజకవర్గంలో పద్మా దేవేందర్ రెడ్డిల భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ విజయం కోసం కార్యకర్తలు కృషి చేశారన్నారు. ప్రతి ఇంటికి చేరి కేసీఆర్ సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారన్నారు. ఏ పార్టీ గెలుపైనా కార్యకర్తల కృషిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా కృషి చేసిన ప్రతి కార్యకర్తకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ శ్రేణులు 3వ తేదీన సంబురాలు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలలో వృద్ధులకు, దివ్యాంగులకు మంచి ఏర్పాట్లు చేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.



మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజ్ఞాపూర్‌లో ఆర్యవైశ్య ప్రముఖుడు ప్రొద్దుటూరు వెంకటయ్య శుక్రవారం ఆకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ. రాజమౌళి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపి అందరితో కలుపుగోలుగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్న ప్రొద్దుటూరి వెంకటయ్య మరణించడం చాలా బాధాకరమన్నారు. పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వధువు కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో నిరుపేద కుటుంబమైన గౌరబోయిన పద్మ- సంపతిల కూతురు పవిత్ర వివాహానికి ప్రజా ప్రతినిధులు క్వింటాలు బియ్యాన్ని అందజేశారు. కుటుం బ పరిస్థితి తెలుసుకున్న ఎంపీటీసీ కోల సునీత మహేందర్ గౌడ్ 50 కిలోలు, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్ 50 కిలోల చొప్పున పంపించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గౌరబోయిన కనకయ్యకొండిల్ల రాజు,గౌరబోయిన స్వామి, భీమరి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య




నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామానికి చెందిన బొక్కల మల్లవ్వ (50) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత నెల 30వ తేదిన మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతు చెందారు. బొక్కల మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ

ఎన్నికల ప్రచారంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



నవతెలంగాణ-తొగుట

ఎన్నికల ప్రచారం ప్రారంభం నుండి సహకరించిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభం నుండి తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను, మేనిఫేస్టో గురించి ప్రజలకు వివరించిన వారికి ధన్యవాదాలు చెప్పారు .కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అమలు చేస్తుందని, ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీద, నిరుపేద వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే విజయం

- కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు యాదగిరి



నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని మార్పుకు దిక్సూచిగా కాంగ్రెస్‌ను ప్రజలు గుర్తించారని మర్కుక్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని, ప్రజలు మార్పును కోరుకున్నారన్నారు..దీనికి నిదర్శనం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలేనని పేర్కొన్నారు.

సురభి మల్టీస్పెషాల్టీలో 10 రోజులు ఉచిత వైద్యం



నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్

సిద్దిపేటలో నూతనంగా ప్రారంభమైన సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఈ 1 నుంచి పదో తేదీ వరకు 10 రోజులపాటు ఉచిత వైద్య సేవలను అందించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శివరామ చారి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలన్న ఆలోచనతో పది రోజులపాటు ఉచిత వైద్యాన్ని అందించడంతోపాటు ల్యాబ్ పరీక్షలలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని దాంతోపాటు సిద్దిపేట పట్టణంలో ఉన్న అన్ని మల్టీస్పెషల్టి హాస్పిటల్ కంటే అతి తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. జనరల్ మెడిసిన్ పీడియాట్రిషన్ ఆర్తో జనరల్ సర్జన్ గైనకాలజిస్టులకు సంబంధించిన సేవలను అందిస్తున్నామని 24 గంటల పాటు అత్యవసర సేవలను కూడా అందిస్తామని తెలిపారు. మిట్టపల్లి లో ఉన్నటువంటి సురభి మెడికల్ కళాశాల మరియు హాస్పటల్ కు అటాచ్మెంట్తో ఈ హాస్పిటల్ ఏర్పాటు చేశామని ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందిస్తామని తెలిపారు.ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో డాక్టర్ శివ జనరల్ సర్జన్, డాక్టర్ అపూర్వ పేడియాట్రిషన్, డాక్టర్ వెంకటరమణారెడ్డి జనరల్ మెడిసిన్, డాక్టర్ స్రవంతి గైనకాలజిస్ట్, డాక్టర్ హర్ష ఆర్తో, పి ఆర్ ఓ పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండలంలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఎవరికి పీఠం దక్కనున్నదో

- ఈవీయంలో ఫలితాల నిక్షిప్తం
- మేమే గెలుస్తాం ఎవరికి వారే ధీమా





నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ , హుస్నాబాద్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలలో ఓటర్లు ఎవరికి అధికారం ఇవ్వనున్నారో, ఎవరిని ఇంటిదారి పట్టించనున్నారో ఈ నెల 3న తేలనుంది. జిల్లాలో అత్యధికంగా దుబ్బాక నియోజకవర్గం లో 87.51 శాతం ఓట్లు పోల్ కాగా, అత్యల్పంగా సిద్దిపేటలో 76.33 శాతం ఓట్లు పోలయ్యాయి.

పోలైన ఓట్ల వివరాలు...

సిద్దిపేట నియోజకవర్గంలో మొత్తం 2,33,733 ఓట్లు ఉండగా, అందులో 1,78, 420 ఓట్లు పోల్ అయ్యాయి. 76.33 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులలో 1,15,346కి గాను 88, 673 ఓటర్లు ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. మహిళలలో 1,18,317కి గాను 89, 710 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70 మంది ఇతరులు ఉండగా 37 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం 1,98,100 ఓట్లు ఉండగా, అందులో 1,73,366 ఓట్లు పోల్ అయ్యాయి. 87.51 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులలో 97,019కి గాను 85,551 ఓటర్లు ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. మహిళలలో 1,01,081కి గాను 87, 815 ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలో మొత్తం 2,74,654 ఓట్లు ఉండగా, అందులో 2,31,086 ఓట్లు పోల్ అయ్యాయి. 84.14 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులలో 1,36,294కి గాను 1,15,892 ఓటర్లు ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. మహిళలలో 1,38, 353కి గాను 1,15,191 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 7 మంది ఇతరులు ఉండగా ముగ్గురు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,42,182 ఓట్లు ఉండగా, అందులో 2,04,999 ఓట్లు పోల్ అయ్యాయి. 84.66 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులలో 1,19,763కి గాను 1,01,898 ఓటర్లు ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. మహిళలలో 1,22,415కి గాను 1,03,100 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 4 మంది ఇతరులు ఉండగా ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఈవీఎంలలో ఫలితాలు నిక్షిప్తం...

అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయి. ప్రతి నియోజకవర్గంలో 14 టేబుల్‌లను కౌంటింగ్ కోసం అధికారులు సిద్ధం చేశారు. ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూముల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎవరికి వారే ధీమా

పోటీలో ఉన్న అభ్యర్థులలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తామే గెలుస్తామని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో తామే అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ, కాదు తామే హైట్రిక్ గెలుపు సాధిస్తామని బీఆర్ఎస్ నాయకులు ఎవరికి వారే చెప్పుకుంటున్నారు. ఎవరికి పట్టం కట్టనున్నారో.... ఎవరు గెలుస్తారు. మూడో తేదీ నాటి వరకు వేచి చూడాల్సిందే.

ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపామని బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ పాతుకుల లీలా దేవి వెంక టేశం, మాజీ సర్పంచ్ పాల లక్ష్మణ్ గౌడ్ అన్నారు. శుక్రవారం పోతారం గ్రామంలో ఎంపీ నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. మండలం నుండి మంచి మెజారిటీ సాధిస్తామని ఎంపీకి వివరించారు. అనంతరం స్పందించిన ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల కోసం, పార్టీ కోసం అందరూ పని చేయడం శుభపరిణామం అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసు కునేందుకు అందరూ సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో బండారు రమేష్ గౌడ్,పాతుకుల వెంకటి,ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మిరుదొడ్డి : బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి అధిక మెజార్టీతో గెలవాలని వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, సర్పంచ్ కిష్టయ్య, కో అప్షన్ సభ్యులు హమ్మద్ ఆధ్వర్యంలో దుబ్బాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ రాజులు మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అధిక మెజార్టీతో గెలిపించి దుబ్బాక ప్రజలకు అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి త్వరలో కోలుకొని ప్రజలకు మంచి సేవలు అందించాలని వారు వెంకటేశ్వర స్వామి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గుండమ్మ ప్రసాద్, ఉప సర్పంచ్ దిలీప్ రెడ్డి, మల్లయ్య మధు,నితిన్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు... ప్రజల గెలుపు



- హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అది ప్రజల గెలుపనీ, ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఇందుర్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూమును ఆయన పరిశీలించి, లెక్కింపు జరుగు కౌంటర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు మారుస్తూ వచ్చారని, ఫలితాల అప్పుడు కూడా మార్పులు చేర్పులు చేశారని, అది జరగకుండా పూర్తి వివరాలు తెలుసుకోవడానికి వచ్చినట్లు తెలిపారు. ప్రగతిభవన్ నుండి పరిపాలించిన సీఎం కేసీఆర్ కు ఓటమి తప్పదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులందరూ ఐక్యంగా ఉండి పనిచేశామని, గెలిచేది ప్రజాస్వామ్యమని అన్నారు. సిపిఐ పార్టీ పూర్తిగా మద్దతు ఇచ్చి, తమ తరఫున ప్రచారం చేసినట్లు తెలిపారు. గడిల, నియంతృత్వ పాలనపై ప్రజలు గెలుస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ లో నరేంద్ర మోడీ తెలంగాణ ఉద్యమాన్ని అగౌరపరిచారని, తెలంగాణ ఉద్యమాన్ని గౌరవిస్తున్నామని పార్లమెంటులో మోడీ ప్రకటించాలని, డబుల్ ఇంజన్ సర్కార్ కు రెండే సీట్లు వచ్చే అవకాశం ఉందని అన్నారు. సీఎం కేసీఆర్ , పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ అని, పదవులన్నీ వారికేనని, ఒక బీసీ వ్యక్తికైనా పదవి ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ లో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో 82 సీట్లతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ హైస్కూల్లో షార్ట్ సర్క్యూట్


- విద్యార్థి సంఘాల ఆందోళన

నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్

సిద్దిపేట పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద ఉన్న కాకతీయ హైస్కూల్లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అక్కడి సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించడంతో ఆస్తి, ప్రాణ నష్టం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టాయి పాఠశాలలో సిలిండర్ ఉండడంపై అభ్యంతరాలు తెలిపాయి. ఫ్రిడ్జ్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగలు వ్యాప్తి చెందడంతో విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. మంటలు ఒక గది వరకు మాత్రమే వ్యాప్తి చెందడంతో ప్రమాదం పెద్దగా జరగలేదు. ఇకమీదటైనా అన్ని రకాల వసతులతో నిబంధనలతో పాఠశాల నడిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు.

బీఆర్ఎస్ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

- ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు ధన్యవాదాలు
- దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి ధన్యావాదాలు తెలిపారు. శుక్రవారం కొత్త ప్రభాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 45 రోజులుగా బీఆర్ఎస్ పార్టీ కోసం కోసం శక్తి వంచన లేకుండా పని చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలు, ప్రజలకు, సోషల్ మీడియా వారియర్‌లకు పేరు పేరున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి ప్రచారం చేసి ప్రజలకు వివరిస్తూ కృషి చేయడం అభినంద నీమన్నారు. మూడో సారి తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుం దని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ మూడవ సారి ముఖ్యమంత్రి కావడం తధ్యమన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాయం

- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మర్కుక్ లో ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని గజ్వేల్ లో సీఎం కేసీఆర్ హైట్రిక్ గెలుపు ఖాయమన్నారు. అయా వార్త సంస్థలు ఇచ్చే ఎగ్జిట్ పోల్స్ ను తలకిందులు చేస్తూ టిఆర్ఎస్ ప్రభుత్వమే విజయ డంకా మోగిస్తుందన్నారు.

శ్రీ మహంకాళి దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మిరుదొడ్డి

మండల కేంద్రంలోని శ్రీ మహంకాళి దేవాలయ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నూతన కమిటీ అధ్యక్షులుగా ఎలుముల స్వామి, ఉపాధ్యక్షులుగా తోకల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా స్వామి, సహాయ కార్యదర్శిగా తోట వెంకటరెడ్డి, కోశాధికారిగా మహిపాల్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఎలుముల స్వామి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న శ్రీ మహ ంకాళి కమిటీ సభ్యులకు రుణపడి ఉంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జిన్నారంలో 67.93% పోలింగ్



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల వ్యాప్తంగా 67.93% పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మండల కేంద్రమైన జిన్నారంలోని 36, 37, 38 , పోలింగ్ బూతుల్లో వరుసగా 80, 82, 84, శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే జంగంపేట గ్రామంలో పోలింగ్ బూత్ నంబర్ 40 లో 89 శాతం, ఓట్లలో 41 పోలింగ్ బూత్ లో 89 శాతం, 42 పోలింగ్ బూత్లో 91 శాతం సోలక్పల్లి 43 పోలింగ్ బూత్ లో 87 శాతం, రాళ్లకత్వ 44 పోలింగ్ బూత్ లో 95 శాతం, శివానగర్ 46 సెంటర్లో 81%, 47 సెంటర్లో 85%, కొడకంచి 48 సెంటర్లో 87% పుట్టగూడ 49సెంటర్లో 92%, నల్తూరు 50 సెంటర్లో 80 శాతం, వావిలాల 51 సెంటర్లో 82% వ 52 సెంటర్లో 81 శాతం, చెట్ల పోతారంలో 53 సెంటర్లో 90 శాతం, 54 సెంటర్లో 80%, గడ్డపోతారం 55 సెంటర్లో 78%, కిష్టయ్య పల్లి 56 సెంటర్లో 80%, మాదారం 57 సెంటర్లో 86%, 58 సెంటర్లో 84%, కాజిపల్లి 59 సెంటర్లో 79% 60 సెంటర్లో 48 శాతం, బుల్లోరా కె.వి.ఆర్ స్కూల్ 61, 62, 63, సెంటర్లలో వరుసగా 62 శాతం ,59 శాతం, 62% శాతం బొల్లారం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో వరుసగా 64 65 66 సెంటర్లలో 57% 48% 55% రవి పబ్లిక్ స్కూల్ బొల్లారంలో వరుసగా 67 68 69 సెంటర్లలో 64% 50% 54% జడ్పీహెచ్ఎస్ బొల్లారం పాఠశాలలో వరుసగా 71 72 73 74 సెంటర్లలో వరుసగా 57% 51% 47% 57% 54% బొల్లారం తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలలో 75 76 77 78 79 సెంటర్లలో 69% 59% 70% 64% 65% ఆక్స్ఫర్డ్ స్కూల్ బొల్లారం పాఠశాలలో వరుసగా 80 81 82 83 సెంటర్లలో 59 శాతం 69 శాతం 63 శాతం 49 శాతం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ బొల్లారంలో వరుసగా 84 85 సెంటర్లలో 63% 57% శాతం ఎన్ వి ఆర్ స్కూల్ బొల్లారంలో వరుసగా 86 87 88 89 సెంటర్లలో 50% 52% 64% 53% వాగ్దేవి స్కూల్ బొల్లారంలో వరుసగా 90 91 సెంటర్లలో 52 శాతం 64% మండల పరిషత్ స్కూల్లో 92 సెంటర్లో 59% పోలింగ్ నమోదు అయినట్లు జిన్నారం తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. జిన్నారం మండలం వ్యాప్తం మొత్తంగా 55,646 ఓటర్ల గాను 19983 పురుష ఓటర్లు, 18374 మహిళా ఓటర్లు మొత్తం కలిపి 38,357 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

ప్రభాకర్ రెడ్డి విజయం ఖాయం



నవతెలంగాణ-మిరుదొడ్డి
బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయమని పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలం గాణ ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ప్రజలకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉందన్నారు. రైతులకు రైతుబంధు, రైతు భీమా వంటి పథకాలను ప్రతి ఇంటికి అందిస్తున్న నాయకులు కేసీఆర్ ఒక్కరే అని అన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడానికి కొత్త ప్రభాకర్‌రెడ్డి అందుబాటులో ఉంటారన్నారు.

పాముకాటుకు గేదె మృతి



నవతెలంగాణ-మిరుదొడ్డి
పాము కాట తో గేదె మృతి చెందిన ఈ సం ఘటన అక్బరు పేట భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రంగణమైన కనకరాజు రోజు మాదిరిగానే గురువారం రాత్రి గేదెను వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఇంటికొచ్చాడు. శుక్రవారం ఉదయం బావి దగ్గరికి వెళ్లి చూస్తే గేదె చనిపోయి ఉండటంతో పాము కాటు వేసిందన్న అనుమానంతో పశువైద్యాధికారులను సంప్రదించారు. వైద్యులు పాముకాటు వలనే మరణించిందని నిర్ధారించారు. సుమారు రూ.60వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

హుస్నాబాద్ క్రికెట్ క్లబ్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్
హుస్నాబాద్ క్రికెట్ క్లబ్ వార్షికోత్సవంలో బాగంగా శుక్రవారం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గిరిమల వంశీ, ఉపాధ్యక్షులుగా ఠాగూర్ మనోహర్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి శ్రీకాంత్, కార్యదర్శిగా కవ్వ శ్రావణ్ రెడ్డి, కోశాధికారిగా దొడ్ల శ్రీధర్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు జాల శ్రీనివాస్, పంతం నవీన్, గౌరవ సలహాదారులు ఏగురి రవీందర్ రెడ్డి, కాశబోయిన ప్రశాంత్, బుర్ర ప్రవీణ్ హుస్నాబాద్ క్రికెట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపే ఉత్కంఠకు తెర



నవ తెలంగాణ -గజ్వేల్
గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గానికి శనివారం జరిగిన పోలింగ్ ఫలితాలు ఆదివారం వెల్లడి కానున్నాయి. దీంతో అభ్యర్థులు, ఓటర్ల ఉత్కంఠతకు ఆదివారం తెరపడనున్నది. గజ్వేల్‌లో 80.32 శాతం పోలింగ్ జరరగా, ఈవీఎంలను సిద్దిపేట ఇందూరు కళాశాలకు తరలించారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానున్నది. రాష్ట్ర ప్రజల చూపు గజ్వేల్ వైపు ఉండడంతో అసెంబ్లీ ఎన్నిక ఒక్కసారి ఉత్కంఠకు తెరలేపింది. బీఆర్ ఏస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్, బీజేపీ నుంచి ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నుంచి నర్సారెడ్డిలు పోటీ చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ కొన్ని గ్రామాల్లో రాత్రి వరకు కొనసాగింది. గజ్వేల్ 80.32 శాతం పోలింగ్ కావడంతో గెలుపుపై మూడు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. రేపు ఉదయం 8 గంటలకు సిద్దిపేటలోని ఇందూరు కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఎన్నికల అధికారులు గజ్వేల్ అసెంబ్లీ కౌంటింగ్‌గాను14 టేబుల్స్ లో 23 రౌండ్లో ఫలితాలు వెల్లడించనున్నారు.

మెజార్టీ పెరగడం సాంప్రదాయం



- మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

నవతెలంగాణ-సిద్దిపేట
సిద్దిపేటలో హరీష్‌రావు పోటీ చేస్తున్న ప్రతిసారి మెజార్టీ పెరగడం సాంప్రదాయంగా వస్తుందని, ఈ సారి కూడా అదే సాంప్రదాయం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, జాప శ్రీకాంత్ రెడ్డి, పాల సాయిరామ్‌లు అన్నారు. మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలలో భాగంగా తాము ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రతి ఇంట్లో తమకు అపూర్వ స్పందన లభించిందఅన్నారు. అన్ని కుల సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి హరీష్‌రావుకు మద్దతు తెలపడం అభినందనీయం అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని పొందిన హరీష్ రావు భారీ మెజార్టీ సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వల్పంగా పోలింగ్ శాతం తగ్గినప్పటికీ హరీష్ రావుకు మాత్రం ఓట్లు పెరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వడ్లకొండ సాయి, వజీర్, పలువురు పాల్గొన్నారు.

ఆలయంలో కుంకుమార్చన



నవతెలంగాణ-గజ్వేల్
పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆల యంలో శుక్రవారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. మహిళ లు నిర్వహిస్తున్న సామూ హిక వాసవి కన్యకా పరమేశ్వరి పారాయణ ంలో భాగంగా అమ్మవా రికి లక్ష గాజులతో అలంకరించి విశేష పూజ లు నిర్వహించి కుంకుమ అర్చన నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పాల్గొని మాట్లాడుతూ ఆర్యవైశ్య ఆరాధ్య దైవం, వాసవి కన్యకా పరమేశ్వరి పారాయణం వల్ల అంతా మంచి జరుగుతుందన్నారు. గజ్వేల్‌లో సామూహిక వాసవి కన్యకా పరమేశ్వరి పారాయణం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి అమ్మవారి కృప ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలని దైవ భక్తితోనే ముక్తి లభిస్తుందని గజ్వేల్ ప్రజ్ఞపూర్ మున్సిపల్‌లోని ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు అందరూ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక వాసవి కన్యకా పరమేశ్వరి పారాయణంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం అన్నదానంలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ఆర్యవైశ్య నాయకులు సిద్ది బిక్షపతి, నంగు నూరి సత్యనారాయణ, తోట బిక్షపతి, అంతునూరి శివకుమార్, నాగేం దర్, ప్రకాష్, మెట్ రాములు, జే.శేఖర్, కైలాస ప్రశాంత్, వెంకటేష్, సిద్ది నవీన్, అంజయ్య, కృష్ణమూర్తి, సిరిపురం సత్యనారాయణ, ప్రసాద్, మనోహర్ ఆర్యవైశ్య మహిళా విభాగం, చిన్నారులు, పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్‌పై నమ్మకం లేదు

మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్
ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న ఎగ్జిట్ పోల్‌పై నమ్మకం లేదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరా లుగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన తెలంగాణ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. మూడోసారి కూడా అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలుపొందుతారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్నారు. ఎగ్జిట్‌పోల్ మూలంగా కార్యకర్తలు, నాయకులు అయోమయానికి గురవుతున్నారన్నారు. డిసెంబర్ 3న తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

డిసెంబర్ 4న ఛలో ఢిల్లీ



నవతెలంగాణ-మిరుదొడ్డి
దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని డిసెంబరు 4న జరిగే చలో ఢిల్లీకి దళితులు తరలిరా వాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఛలో డీల్లీ పోస్టర్‌ను లింగుపల్లిలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల మీద పెద్ద ఎత్తున దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయడం లేదన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేష న్ల అమలు చేయకపోవడం వలన ఉన్నత విద్య చదివిన దళిత విద్యార్థు లు ఉపాధికి దూరం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.కిరణ్, జె.బాలనర్సు, ఎల్లవ్వ, అనసూయా, మ హేష్ పాల్గొన్నారు

కవ్వంపల్లిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

శాలువ కప్పి కవ్వంపల్లికి సన్మానం



నవతెలంగాణ-బెజ్జంకి
మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కవ్వంపల్లి సత్యనా రాయణను తన నివాస ంలో శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు.గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల్లో మండల కాంగ్రెస్ శ్రేణులు కృషిపై కవ్వంపల్లి ఆనందం వ్యక్తం చేసినట్టు నాయకులు తెలిపారు.రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు,మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,మండల నాయకులు పాల్గొన్నారు.

'అందోల్'లో తగ్గిన పోలింగ్

- 2018లో 89.27 శాతం.. నేడు 84.80 శాతం నమోదు
- ప్రశాంతంగా జరిగిన ఎన్నికలు

2018, 2023లో అందోల్ ఎన్నికల సరళి..

ఏడాది	మొత్తం ఓట్లు	పురుషులు	స్త్రీలు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
2018	2,21,894	1,10,229	1,11,646	1,98,120	89.27
2023	2,49,248	1,22,699	1,26,543	2,11,364	84.80


నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో కంటే ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. గతంలో 89.27 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి జరిగిన ఎన్నికల్లో 84.80 శాతంగా పోలింగ్ నమోద యింది. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కలుపుకొని మొత్తం 18 మంది బరిలో నిలిచారు. కాగా 2018లో బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ 16,465 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

ప్రశాంతంగా ఎన్నికలు..

నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో అక్కడక్కడ చిన్నచిన్న గొడవలు తప్పా.. పెద్దగా సమస్యాత్మకంగా ఎలాంటి ఘటనలు జరగలేదు. ఉదయం పూట ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పల్చగా ఉన్నప్పటికీ, స్థాని కులు, వలస ఓటర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో మధ్యాహ్నం వరకు ఆయా మండలాలలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో ఎన్నికల సమ యం ఐదు గంటల తర్వాత కూడా లైన్లో నిల్చున్న ఓటం ్లను ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. అందోలు గ్రామంలో ఓ పోలింగ్ కేంద్రంలో రాత్రి 8 గంటల వరకప ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఫలితం కోసం తహతహ...



ఓట్ల పండుగ ముగిసిపోయిన కొన్ని గంటల్లోనే ఆయా పార్టీల నాయకులు ఫలితాల కోసం తహత హలాడుతున్నారు. డిసెంబర్ 3న రుద్రారం ప్రాంతం లోని గీతం యూనివర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్లు అధికా రులు చేస్తున్నారు. ఆరోజు ఆయా పార్టీల అభ్యర్థుల భవి తవ్యం బయటపడనుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర ఉత్కంఠ ఉంది. తామంటే తాము విజయం సాధిస్తున్నామని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు.

గీతం స్కాలర్ తనూ శ్రీవాస్తవకు పీహెచ్‌డీ

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని తనూ శ్రీవాస్తవను డాక్టరేట్ వరించిం ది. 'ఏరోస్పేస్ అప్లికేషన్స్ కోసం థర్మల్ ప్రొటెక్షన్ సిస్టమ్స్ అభివృద్ధి, అధ్యయనం' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ కుమార్ కటారి, ప్రొఫెసర్ రావూరి బాలాజీరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.కఠినమైన ఉష్ణ వాతావరణంలో ఏరోస్పేస్ వాహనాలకు ఉపయోగపడే కొత్త థర్మల్ ప్రొటెక్షన్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడం, ఫంక్షనల్ ట్రయల్స్ ప్రాపర్టీ మూల్యాంకనం చేయడం ఈ పరిశోధన లక్ష్యంగా పేర్కొన్నారు. అధ్యయనం ప్రధానంగా తక్కువ సాంద్రత కలిగిన అబ్లేటివ్ పదార్థాలు, ఖర్చుతో కూడుకున్న వాటిపై దృష్టి పెట్టిందన్నారు. ఈ పరిశోధన ప్రధాన ఫలితాలు అభివృద్ధి చెందిన ఉష్ణ, రక్షణ వ్యవస్థలు తీవ్ర వాతావరణాలలో అధిక ఉష్ణోగ్రత అనువర్తనాల కోసం నిరూపించబడినట్టు తెలిపారు. అబ్లేటిన్ పదార్థాలు ఇప్పటికే ఉన్న వ్యవస్థల కంటే మెరుగైన లక్షణ ాలు, తక్కువ నుంచి మధ్యస్థ సాంద్రత కలిగి ఉన్నాయని నిరూపించినట్టు పేర్కొన్నారు. తనూ శ్రీవాస్తవ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీ ఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి కె. నగేష, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాసకులు, సిబ్బంది పలువురు ఆమెను అభినందించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-సంగారెడ్డి



ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి తప్పిపోయాడు. ఈ ఘటన సంగారెడ్డిలో శుక్రవారం జరిగింది. పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలి పిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణం ఇంద్రకాలానికి చెందిన పట్నం జగన్నాథం(75) ఆరోగ్యం బాగాలేకపోవడంతో తన భార్య లక్ష్మితో కలిసి శుక్రవారం ఉదయం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. ఆస ుపత్రిలో చూయించుకొని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తప్పిపోయాడు. ఆయ నకు సరిగి మతిస్థిమితం లేదని సీఐ తెలిపారు. బాధితుడి ఒంటిపై తెలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని.. తన వెంట్రుకలు, మీసాలు తెలుపు రంగులో ఉన్నాయని తెలిపారు. ఆ వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే.. సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పాలని లేదా సమాచారం ఇవ్వాలని కోరారు...

జీఎంఆర్‌ను కలిసిన పార్టీ నాయకులు

గుమ్మడిదల మండలం నుంచి పదివేల మెజార్టీ అందిస్తున్నామని స్పష్టీకరణ

నవతెలంగాణ-గుమ్మడిదల

పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపా ల్‌రెడ్డిని బీఆర్ఎస్ మండల నాయ కులు, కార్య కర్తలు శుక్రవారం మర్యాదపూర్వ కంగా కలిశా రు. గుమ్మడిదల మండల నుంచి పదివేల మె జార్టీ అందిస్తున్నా మని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛన్ పత్రాల అందజేత



నవతెలంగాణ-పటాన్‌చెరు

తమ చందాదారులు, పింఛనుదారులకు చేరువయ్యే విధంగా ప్రతినెలా ప్రయాస్ పథకంలో భాగంగా పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛను పత్రాలను మంజూరు చేస్తున్నట్టు ప్రాంతీయ భవిష్య నిధి కమీషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. నవంబరు నెలలో భాగంగా 17 మంది కి పింఛన్లు మంజూరు చేయగా అందులో 9 మందికి పింఛన్ మంజూరు పత్రాలను శుక్రవారం పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమలలో పని చేసి పదవి విరమణ పొందిన చందాదారులు తమ పింఛను మంజూరు పత్రాలను అందు కొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. యాజ మాన్యాలు, చందాదారులు తమకు పింఛను దరఖాస్తు ఫారమ్ తో పాటుగా ఇతర సంబంధిత పత్రాలు జతచేసి సకాలంలో అందజేసిన యెడ ల వారికి పదవి విరమణ చేసిన నెల లోనే పింఛను మం జూరు పత్రాలను అందజే యడానికి తమ సిబ్బంది అంకిత భావ ంతో పనిచేస్తున ్నారన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెం ట్ పి.ఎఫ్ కమీషనరు ఆర్.శ్రీదేవి, అకౌంట్స్ అధికారి బి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE (SPL. EXCISE). SANGAREDDY DISTRICT. AT. SANGAREDDY.

O.S. NO. 1028 of 2023.

Between: -
Guntaka Venkata Laxmi & others ...Plaintiffs
AND
Mukku Srinivasa Reddy & others
To Whom so ever it may concern. ...Defendants

To
To Whom so ever it may concern.

NOTICE

Please take notice that the Plaintiffs herein has filed the above Suit against the Defendants to declare the plaintiffs are the legal heirs of Late. Guntaka Balarami Reddy, who died on 08-08-2021 and also declare the plaintiffs are the absolute owners and possessors of the Plot bearing No. 79B, admeasuring 200 sq. yards or 167.22 sq. meters in Survey No. 404/A/ 4 and Survey No. 404/A 5 (out of total land admeasuring 12012.15 Sq Yards) in "Gachibowli Paradise County-IV (4)" Situated at Amdoor village and Gram Panchayat, Jinnaram Mandal, Sangareddy District, Telangana. If anybody is having objections or any claims in the said matter, they should appear before this Hon'ble Court on 05-01-2024 through person or by pleader at 10.30 A.M., failing which the matter will be decided according to the Law.

(By order of the Honorable Court)
KASIREDDY SRINIVASULU
Advocate
H. No. 24-39, Opp. Petrol Bunk,
Ashok Nagar, R.C. Puram,
Hyderabad – 502032.
Cell No.9440085474

సంగారెడ్డి వద్ద గౌరవనీయ III అడిషినల్ జూనియర్ జడ్జి కమ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (స్పెషల్ ఎక్సైజ్) సంగారెడ్డి న్యాయస్థానం సమక్షంలో

O.S. No. 1028 ఆఫ్ 2023

దిగువ వారి మధ్య:
గుంటక వెంకట లక్ష్మి మరియు ఇతరులు ...వాదులు
మరియు
ముక్కు శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతరులు
ఎవరికి సంబంధించినదైతే వారికి ...ప్రతివాదులు

To
ఎవరికి సంబంధించినదైతే వారికి

ప్రకటన

వాదులను 08-08-2021 నాడు మరణించిన లేట్ గుంటుక బలరాం రెడ్డి యొక్క న్యాయ వారసులుగా ప్రకటించేందుకు మరియు అందూర్ గ్రామం మరియు గ్రామ పంచాయతీ, జిన్నారం మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ వద్ద గల **"గచ్చిబౌలి ప్యారడైజ్ -IV (4)"**లోని సర్వే నం.404/A/4 మరియు సర్వే నం. 404/A 5 (12012.15 చ.గ .లు విస్తీర్ణం గల మొత్తం భూమిలోనిది) లోని 200 చ.గ.లు లేదా 167.22 చ.మీ.ల విస్తీర్ణం గల ప్లాట్ నం. 79B యొక్క సంపూర్ణ యజమానులు మరియు స్వాధీనదారులు వాదులు అని ప్ర కటించేందుకు ప్రతివాదులకు వ్యతిరే కంగా వాదులు దావా దాఖలు చేశారని తెలియజేయడమైనది. సదరు విశయానికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు లేదా ఏవైనా క్లెయిమ్‌లు ఉంటే, వారు స్వయంగా లేదా ప్లీడరు ద్వారా 05-01-2024న ఉ.10.30 గం.లకు గౌరవనీయ న్యాయస్థానం ఎదుట హాజరు కావలెను, లేనట్లైతే సదరు విషయం చట్టనికి అనుగుణంగా నిర్ణయించబడును.

(గౌరవనీయ కోర్టు ఉత్తర్వు ద్వారా)
కసిరెడ్డి శ్రీనివాసులు, అడ్వకేట్
ఇం.నం. 24-39, పెట్రోల్ బంక్ ఎదురుగా, అశోక్ నగర్, ఆర్.సి. పురం, హైదరాబాద్-502032
సెల్ : 9440085474

IN THE COURT OF THE IX ADDL. DISTRICT & SESSIONS JUDGE RANGA REDDY DISTRICT COURT AT : L.B. NAGAR.

O.S.NO.634 OF 2022

BETWEEN:-
Mr.Srinivas Goud .....Plaintiff
AND
Lambada Kamli & Others .....Defendants

To,
Lambada Keshya, S/o.Late Lambada Sakriya, R/o.Velimala Thanda Village, Ramachandrapur Mandal, Sangareddy District
(13th Defendant)

Please take notice that the plaintiff above named has instituted suit O.S.NO. 634 of 2022 against you & others for declaration and other reliefs. You are hereby summoned to appear in this court in person are by a pleader, on the **11th day of December 2023, at 10:30 A.M.,** to answer the same, failing which the suit will be disposed of ex-parte against you.

//BY ORDER OF THE COURT//
CH.RANGA,
ADVOCATE
H.NO.1-8-522, SV's Papaiah Estate, Chikadapalli,
Hyderabad-5000 20
Cell: 9246178783

కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్న ఈవీఎంలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను గట్టి భద్రత నడుమ పటాన్చెరులోని గీతం యూనివర్సిటీకి తరలించి భద్రపరిచినట్టు ఆర్వో వెంకట్‌రెడ్డి తెలిపారు. జహీరాబాద్ నుంచి సెక్యూరిటీ మధ్య ఈవీఎంల న్నింటినీ తరలించినట్టు చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద జిల్లా కలెక్టర్ శరత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు వివిధ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను భద్రపరి చామన్నారు. పోలింగ్ పర్సంటేజ్‌ను సెక్టార్ ఆఫీసర్స్ నుండి తీసుకున్న వివరాల ఆధారంగా చెప్పారు. జహీరాబాద్‌లో 76.72గా పోలింగ్ శాతం నమోదైనట్టు తెలిపారు.



నవతెలంగాణ



ఎన్నికల పోలింగ్ సరళి పై ఎమ్మెల్యే సమీక్ష

మండలాల వారిగా చర్చలు జరిపిన క్రాంతి కిరణ్

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గంలో భారీగా నమోదైన పోలింగ్ సరళిపై ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్.. రాష్ట్ర నాయకులు చంటి రాహుల్ కిరణ్, పార్టీ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, వీరారెడ్డి, సిద్దన్న పాటిల్, బస్వరాజ్ పాటిల్, బిఆరెస్ నాయకులు, శంకర్, పార్టీ ము ఖ్య నాయకులతో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మం డలాల వారీగా నమోదైన పోలింగ్ పర్సెంటేజ్‌లపై 9 మండలాల బీఆర్ఎ స్ అధ్యక్షులు, సీనియర్ నేతలతో సమీక్షించారు. పోలింగ్ విధానం, పర్సం టేజ్, మెజార్టీ, ఇతర అంశాలపె చర్చలు జరిపారు. గతంలో మండ లాల వారీగా వచ్చిన మెజార్టీ, లోపాలపై సుదీర్ఘంగా చర్చించారు. గతం లో తక్కువ మెజార్టీ వచ్చిన మండలాలు, ప్రస్తుత పరిస్థితులపై రివ్యూ చేశారు.



లాఠీఛార్జ్‌లో గాయపడిన వారికి రాజనర్సింహ పరామర్శ

నవతెలంగాణ-మునిపల్లి

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో పోలీసులు చేసిన లాఠీచార్జిలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంగారెడ్డి చౌరస్తాలో గల చరిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో లాఠీచార్జి చేయించారని ఆరోపించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడేది లేదని, అందుకు కార్యకర్తలెవరూ భయపడొద్దని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, ఎంపిటిసి పాండు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ విజయం ఖాయం..

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ విజయం ఖాయమని జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య అన్నారు. ఆందోల్ నియోజకవర్గం లో జరిగిన ఎన్నికల సందర్భంగా శు క్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కష్టపడి పని చేసిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, ఓటింగ్‌లో పాలుగొన్నా నియోజకవర్గం ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చంటి క్రాంతి కిరణ్ రెండోసారి ఎమ్మెల్యే కావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ డీబి. నాగభూషణం, నాయకులు చాపల వెంకటేశం, గాజుల నవీన్ కుమార్, తుపాకుల సునీల్ కుమార్, సత్యం, మహేష్ యాదవ్, బిర్లా శంకర్, ఉస నాగరాజు, నాయికోటి అశోక్, రమణ, సాయిలు, సత్యం , గోపాల్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడే లెక్కలు..



- విజయంపై ఎవరి ధీమా వారిదే
- ఆశల పల్లకిలో అభ్యర్థులు
- వెల్లడి కానున్న అభ్యర్థుల భవితవ్యాలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఓట్ల పండగ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యాలు ఈవీఎంలలో నిరీప్తమై ఉన్నాయి. నేతలు మాత్రం ఎక్కడికక్కడ లెక్కలేసుకుంటున్నారు. వర్గాలు, ప్రాంతా లవారీగా తమకు ఎన్ని ఓట్లు వచ్చాయో ఆరా తీస్తూ ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. అందుకు అనుగు ణంగానే మెజారిటీపై ఆశలు పెంచుకుంటు న్నారు. 10వేల పైగానే మెజారిటీ సాధిస్తామని ఒక పార్టీ అభ్యర్థి పేర్కొంటుండగా రెండు మూడు వేల ఓట్లతో గట్టెక్కుతానాని మరో అభ్యర్థి ధీమాతో ఉన్నారు. అభ్య ర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిర్లిప్త మై వుండగ లెక్క లు మాత్రం నియోజకవర్గంలో రాజ్యమేలుతు న్నాయి. ఒకటి రెండు వర్గాల నుంచి క్షేత్రస్థాయి పరిస్థితి లేదా తాము అనుకున్న విధంగా వివరాలు రాకపోతే సదరు అభ్యర్థులు మళ్లీమళ్లీ చూసుకుంటున్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గం మిని ఇండియాగా దేశంలోని నలుమూలల నుంచి వచ్చి జీవనం సాగి స్తున్నారు. ఇటు కార్మిక వర్గం, అటు సాఫ్ట్ వేరు. ఉద్యో గ .యువతతో మిళితమై ఉండటంతో అ ఓట్లు కీలకం గా మారాయి. డబ్బులు తీసుకుని ఓటరు తమకి వేశా రన్న నమ్మకం సదరు అభ్యర్థులకు కుదరడం లేదు. ఎన్ని ఓట్లు పోలయ్యాయి. ఏ ఏ వర్గాలు ఓట్లు వేశాయి. వారు

ఎవరెవరికి వేసి ఉండవచ్చు. అన్న అంశాలపై అభ్యర్థులు వారి మద్దతుదారులు. అనుచరుల నుంచి వివరాలు తీసుకుంటున్నారు. గ్రామాలలో ప్రచారాలతో పాటు డబ్బు పంపిణీ కూడా అభ్యర్థులు వ్యూహాత్మకంగా అందజేయడం జరిగిందని గుసగుసలు వినిపిస్తున్నా యి. అభ్యర్థులు పోలింగ్‌తో పాటు తమ విజయా వకా శాలపై వివిధ వర్గాల నుంచి సమాచారం సేకరిస్తున్నా రు. అప్పటికే తాము తీసుకున్న వివరాలతో పాటు అక్కడి సామాజిక వర్గాల ఓటుబ్యాంకు ను కూడా పరిగ ణలోకి తీసుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. ఇదే కాక కాంగ్రెస్ బీఆర్ఎస్‌లతో పాటు బీఎస్పీ, సీపీఐ(ఎం), బీజేపీలు ఇతర స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రధాన పార్టీల ఓట్లను చీల్చు తాయనే ఆందోళన పడుతు న్నారు. నిశ్శబ్ద క్రాస్ ఓటింగ్‌తో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని విశ్లేషకులు భావి స్తున్నారు. ఇది ఎవరికి అనుకూలిస్తుందని అంచనా వేయలేకపోతున్న ప్పటికి తమకే అనుకూలిస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఇందుకు తమ ప్రత్యర్థుల బలహీనతలను కారణాలుగా విశ్లేషించు కుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆయా సామాజిక వర్గాలు బలంగా ఉన్న ప్రాంతాల్లో గతంలో పోలింగ్ సరళి ఏ పార్టీకి అనుకూలంగా ఉందో కొంత తెలిసిపోయేది, కానీ ఇప్పుడు పూర్తి భిన్నమైన పరిస్థితి కొనసాగుతుండడంతో అభ్యర్థుల సన్నిహిత అనుచ రుడు కూడా ఖచ్చితమైన వివరాలు చెప్పలేకపో తున్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తమ సొంత కుటుంబ సభ్యులు కూడా ఎవరికి ఓటు వేశారో తెలియని పరిస్థితి అని అనుకుంటున్నారు. గతంలో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓట్ల లెక్కింపు ఉండడంతో ఏ ప్రాంతంలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలిసేది కాదు. ఇప్పుడు ఈవీఎం వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పోలింగ్ బూత్ వారీగా కూడా పార్టీ లేదా అభ్యర్థికి వచ్చిన ఓట్లు తెలిసిపోతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ఎన్ని ఓట్లు వచ్చాయి అనేది ఎక్కడ నష్టం జరిగిందనేది తెలియదని చెప్పొచ్చు. ఏదిఏమైనా పూర్తి స్థాయిలో ఎన్నికల ఫలితాలు రావాలంటే ఈనెల మూడు వరకు వేచి చూడాల్సిందే. అంతవరకు అభ్య ర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్నాయి.

ఓటర్లు పెరిగినా.. తగ్గిన పర్సంటేజ్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో ఓటర్లు పెరిగిన ప్పటికీ.. పోలింగ్ శాతం తగ్గిపోవడం చర్చనీయాంశ ంగా మారింది. 2018 ఎన్నికల్లో రెండు లక్షల 42 వేల పైచిలుకు ఓటర్లు ఉండగా 81.35 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం 2023 ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలో 2 లక్షల 70 వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. కానీ కేవలం 76.72 శాతం ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగిం చుకోవడం స్థానిక ంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సిబ్బందితో పాటు.. బరిలో ఉన్న అభ్యర్థులు గడపగడపకు వెళ్లి ఓటును వినియోగించు కోవాలని ప్రజలను చైతన్యం చేశారు. అయినప్పటికీ పోలింగ్ పర్సంటేజీ తగ్గడం గమనార్హం. ఓటు హక్కును వినియోగించుకుని ఐదేండ్లు తమ నియోజకవర్గానికి అభివృద్ధి చేసే నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటర్ల కోసంప్రభుత్వం అన్ని విధాల సౌకర్యాలను సైతం కల్పిం చినా కొందరిలో మా త్రం చైతన్యం రావడం లేదు. కార్మికు లకు, ప్రభుత్వ ఉద్యోగులకు సైతం వేత నంతో కూడిన సెలవులు ఇచ్చినప్పటికీ ఓటింగ్ హాజరు శాతం పెరగకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తుంది.

కాటాను కలిసిన కార్యకర్తలు

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పటాన్చెరువు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాటాశ్రీనివాస్ గౌడ్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన గెలుపును ఎవరు ఆపలేరని గుమ్మడిదల మండలం నుండి సుమారు ఐదు వేల ఓట్ల మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రేపు(ఆదివారం) విజయ డంకా మోగించనున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏం నరేందర్ రెడ్డి, ఆకుల ఆంజనేయులు, కర్ణాకర్ రెడ్డి, ఖాజా, పార్టీ నాయకులు,



కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.